ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం

స్మార్ట్ ఎడిషన్
EVENING 6 PM

సంపుటి (Volume): 1 + సంచిక (Issue): 324 + Published From: నంద్యాల (Nandyal) + పేజీలు 2 + https:www.prajarepublic.com + వెల - 1/-
గురువారం 26 జూన్ 2025
RNI No: APTEL/2023/87888
Andhrapradesh, Telangana, Kurnool, Vijayawada, Vishakapatnam, Tirupati, Ananthapuram, Rajamahedravaram, Guntur, Nellore, Srikakulam, Thadepallegudem, Kadapa, Ongole

ఎయిరిండియా విమాన ప్రమాదం.. బ్లాక్ బాక్స్ నుంచి డేటా డౌన్లోడ్ పూర్తి

దిల్లీ, జూన్ 26, (రిపబ్లిక్ న్యూస్): అహ్మదాబాద్ లో చోటుచేసుకున్న దిగ్భ్రాంతికర విమాన ప్రమాద ఘటన పై ఎయిర్క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేటర్ బ్యూరో దర్యాప్తు కొనసాగుతోంది. ప్రమాదానికి గురైన విమానం బ్లాక్ బాక్స్ లు నుంచి డేటా విశ్లేషణకు మార్గం సుగమమైంది. ఇందులోని డేటాను ఏఏఐబీ ల్యాబ్ విజయవంతంగా డౌన్లోడ్ చేసింది. ఈ విషయాన్ని పౌరవిమానయాన మంత్రిత్వ శాఖ వెల్లడించింది.

ఈ మేరకు డేటా విశ్లేషణపై గురువారం ఓ ప్రకటన విడుదల చేసింది. "విమాన ప్రమాదం తర్వాత ఘటనపై దర్యాప్తునకు జూన్ 13న ఏఏఐబీ బృందాన్ని ఏర్పాటు చేసింది. దీనికి ఏఏఐబీ డీజీ నేతృత్వం వహిస్తున్నారు. అదే రోజున ఘటనాస్థలంలోని రూఫెప్పై కాక్పిట్ వాయిస్ రికార్డర్లు, ఫ్లైట్ డేటా రికార్డర్లను గుర్తించాం. ఆ తర్వాత విమాన బ్లాక్బాక్సులను కూడా స్వాధీనం చేసుకుని అత్యంత భద్రత నడుమ దిల్లీకి తరలించాం. జూన్ 24 నుంచి వీటిల్లోని డేటాను బయటకు తీసే ప్రక్రియను సాంకేతిక బృందం ప్రారంభించింది. విమానం ముందువైపు ఉండే బ్లాక్బాక్స్ నుంచి క్రాష్ ప్రొటెక్షన్ మాడ్యూల్‌ను భద్రంగా బయటకు తీశాం. జూన్ 25న మెమోరీ మాడ్యూల్ను విజయవంతంగా యాక్సెస్ చేసి అందులోని డేటాను ఏఏఐబీ ల్యాబ్ లో డౌన్లోడ్ చేశాం. కాక్పిట్ వాయిస్ రికార్డర్, ఫ్లైట్ డేటా రికార్డర్లో ఉన్న డేటా విశ్లేషణ కొనసాగుతోంది. దీంతో ప్రమాద సమయంలో ఏం జరిగిందో తెలుసుకునేందుకు, ప్రమాద కారణాలను వెలికితీసేందుకు అవకాశం ఏర్పడింది. భవిష్యత్తులో ప్రమాదాల నివారణకు ఈ విశ్లేషణ ఉపయోగపడుతుంది" అని విమానయాన శాఖ తమ ప్రకటనలో వెల్లడించింది. అహ్మదాబాద్ నుంచి జూన్ 12న లండన్ బయలుదేరిన ఎయిరిండియా డ్రీమ్ లైనర్ విమానం.. టేకాఫ్ అయిన కొన్ని క్షణాల్లోనే కుప్పకూలిపోయింది. ఘటన సమయంలో విమానంలో 242 మంది ఉండగా.. ఒకే ఒక్క వ్యక్తి మాత్రం ప్రాణాలతో బయటపడ్డారు. మిగతా 241 మంది మృతిచెందారు. ఇక, ఈ విమానం మెడికల్ కాలేజీ హాస్టల్పై పడటంతో అందులోని పలువురు మృతిచెందారు. మొత్తంగా ఈ దుర్ఘటనలో మృతుల సంఖ్య 270 పైనే ఉన్నట్లు గుజరాత్ ప్రభుత్వం వెల్లడించింది.

యువత మాదకద్రవ్యాలను తిరస్కరించాలి:మంత్రి నారా లోకేశ్

అమరావతి, జూన్ 26, (రిపబ్లిక్ న్యూస్): యువత మాదకద్రవ్యాలను తిరస్కరించాలని మంత్రి నారా లోకేశ్ పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్'లో పోస్టు చేశారు. మెరుగైన భవిష్యత్ కోసం యువశక్తిని ఉపయోగించుకోవాలన్నారు. డ్రగ్స్ వినియోగాన్ని అరికట్టాలనే లక్ష్యంతో ముందుకెళుతున్నట్లు చెప్పారు. కఠినంగా చట్టాల అమలు, నిఘా ద్వారా మాదకద్రవ్యాలను అరికట్టడానికి ప్రభుత్వం చొరవ చూపుతోందని లోకేశ్ అన్నారు.

డ్రగ్స్ రహిత రాష్ట్రమే సీఎం చంద్రబాబు ధ్యేయం: శాప్ చైర్మన్ రవినాయుడు

విజయవాడలోని శాప్ కార్యాలయంలో అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని నిర్వహించారు. 'డ్రగ్స్ వద్దు - క్రీడలు ముద్దు' అంటూ ప్లకార్డులు పట్టుకుని క్రీడాకారులు నినాదాలు చేశారు. ముఖ్య అతిథిగా అంతర్జాతీయ టెన్నిస్ క్రీడాకారుడు సాకేత్ మైనేని పాల్గొన్నారు. శాప్ చైర్మన్ రవినాయుడు మాట్లాడుతూ.. డ్రగ్స్ రహిత రాష్ట్రమే సీఎం చంద్రబాబు ధ్యేయం అన్నారు. డ్రగ్స్ మహమ్మారిపై కూటమి ప్రభుత్వం ఉక్కు పాదం మోపుతోందని చెప్పారు. మాదకద్రవ్యాల నియంత్రణకు శాప్ పూర్తిస్థాయిలో కృషి చేస్తోందని పేర్కొన్నారు. సాకేత్ మైనేని మాట్లాడుతూ.. యువత డ్రగ్స్ విడిచిపెట్టి క్రీడల్లో రాణించాలని సూచించారు.

పహల్గాం ప్రస్తావన లేకుండా ఎస్సీఓ పత్రం.. చైనా సదస్సులో సంతకం చేయని రాజ్‌నాథ్ సింగ్

జూన్ 26, (రిపబ్లిక్ న్యూస్): చైనా పర్యటనలో ఉన్న భారత రక్షణశాఖ మంత్రి రాజ్నాథ్ సింగ్.. షాంఘై సహకార సంస్థ సదస్సులో పాల్గొన్నారు. ఈ సమావేశంలో పహల్గాం ఉగ్రదాడి, సీమాంతర ఉగ్రవాదం గురించి ఆయన కీలక ప్రసంగం చేశారు. సమావేశం అనంతరం దీనిపై జాయింట్ డాక్యుమెంట్ను సిద్ధం చేశారు. అయితే, అందులో పహల్గాం ప్రస్తావన లేకపోవడంతో ఆ పత్రం పై సంతకం చేసేందుకు రాజ్నాథ్ నిరాకరించారు. దీంతో సంయుక్త ప్రకటనను రద్దు చేయాల్సి వచ్చింది. చైనాలోని క్వింగ్డావోలో షాంఘై సహకార సంస్థ సభ్య దేశాల రక్షణ మంత్రిత్వస్థాయి సదస్సు నిర్వహించారు.

ఇందులో భారత్, చైనా, పాకిస్థాన్తో పాటు 10 సభ్య దేశాల రక్షణ మంత్రులు పాల్గొన్నారు. సదస్సు అనంతరం రూపొందించిన జాయింట్ డాక్యుమెంట్.. ఉగ్రవాదంపై భారత కఠిన వైఖరిని సుస్పష్టంగా ప్రతిబింబించలేకపోయింది. అంతేగాక, ఈ ఏడాది ఏప్రిల్లో జమ్మూకశ్మీర్ లో చోటుచేసుకున్న పహల్గాం ఉగ్రదాడి ఘటనను అందులో ప్రస్తావించలేదు. అదే సమయంలో బలోచిస్థాన్ అంశాన్ని చేర్చి భారత్ను నిందించే ప్రయత్నం జరిగింది. దీంతో ఉగ్రవాదంపై భారత వైఖరిని నీరుగార్చేలా ఉన్న ఆ పత్రం పై సంతకం చేసేందుకు రాజ్నాథ్ సింగ్ నిరాకరించారు. ఉగ్రవాద అంశంపై సదస్సులో భిన్నాభిప్రాయాలు రావడంతో సమావేశం అనంతరం రక్షణ మంత్రుల సంయుక్త ప్రకటనను ఆర్గనైజేషన్ రద్దు చేసింది. పాకిస్థాన్ వల్లే ఈ జాయింట్ డాక్యుమెంట్ నుంచి పహల్గాం ప్రస్తావనను మినహాయించి ఉంటారనే సంకేతాలు కన్పిస్తున్నాయి. ఈ సదస్సుకు చైనా అధ్యక్షత వహిస్తోంది. అంతకుముందు ఈ సదస్సులో రాజ్నాథ్ సింగ్ మాట్లాడుతూ.. కొన్ని దేశాలు సీమాంతర ఉగ్రవాద విధానాన్ని సాధనంగా వాడుకుంటున్నాయని పరోక్షంగా దాయాదిని దుయ్యబట్టారు. తమ స్వార్థ ప్రయోజనాల కోసం ఉగ్రవాదులను పెంచి పోషించే దేశాలు అందుకుతగ్గ పరిణామాలు ఎదుర్కోక తప్పవన్నారు. పహల్గాం దాడి, ఆపరేషన్ సిందూర్ తర్వాత భారత్, పాకిస్థాన్ రక్షణమంత్రులు ఎదురుపడటం ఇదే తొలిసారి. అయితే, ఈ సదస్సులో వీరిద్దరి మధ్య ఎలాంటి పలకరింపులు జరగలేదని విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. ఇక, 2020లో గల్వాన్ ఘర్షణ తర్వాత నుంచి భారత రక్షణ మంత్రి చైనాలో పర్యటించడం ఇదే తొలిసారి కావడం గమనార్హం. ఈ ఆర్గనైజేషన్లో బెలారస్, చైనా, భారత్, ఇరాన్, కజకిస్థాన్, కిర్గిస్థాన్, పాకిస్థాన్, రష్యా, తజకిస్థాన్, ఉజ్బెకిస్థాన్ సభ్య దేశాలుగా ఉన్నాయి.

'హనీమూన్ మర్డర్ కేసులా మనం దొరక్కూడదు'.. సర్వేయర్ హత్య కేసులో కీలక విషయాలు

గద్వాల, జూన్ 26, (రిపబ్లిక్ న్యూస్): వివాహేతర సంబంధానికి అడ్డస్తున్నాడనే ప్రైవేట్ సర్వేయర్ తేజేశ్వర్ను ఆయన భార్య ఐశ్వర్య హత్య చేయించినట్లు జోగులాంబ గద్వాల జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు. గురువారం గద్వాలలో నిర్వహించిన మీడియా సమావేశంలో కేసుకు సంబంధించిన కీలక విషయాలను ఆయన వెల్లడించారు. వివాహమైన నెలకే ప్రియుడు, బ్యాంక్ మేనేజర్ తిరుమల్రావుతో కలిసి ఐశ్వర్య కుట్ర చేసినట్లు తెలిపారు. సుపారీ గ్యాంగ్ సాయంతో భర్తను చంపించినట్లు వివరించారు.

"ఈనెల 17న తేజేశ్వర్ అదృశ్యమయ్యాడు. ఈనెల 21న గాలేరు- నగరి కాల్వలో ఆయన మృతదేహం లభ్యమైంది. గతేడాది డిసెంబర్లో లో ఐశ్వర్య-తేజేశ్వర్కు నిశ్చితార్థం జరిగింది. అప్పటి నుంచే తేజేశ్వర్ను హతమార్చేందుకు తిరుమల్రావు, ఐశ్వర్య కుట్ర చేశారు. ఈ హత్యకు తిరుమల్రావు సుపారీ ఇచ్చారు. బ్యాంకులో రుణం కోసం తన వద్దకు వచ్చిన నగేశ్తో ఒప్పందం చేసుకున్నాడు. తేజేశ్వర్ కదలికలు తెలుసుకునేందుకు అతడి బైక్కు జీపీఎస్ అమర్చారు. పొలం గురించి మాట్లాడదామని నిందితులు తేజేశ్వర్ను కారులో తీసుకెళ్లి వేటకొడవళ్లతో హతమార్చారు. మృతదేహాన్ని గాలేరు-నగరి కాలువలో పడేశారు. నిందితులు ఇటీవల మేఘాలయలో జరిగిన హనీమూన్ మర్డర్ కేసు గురించి చర్చించుకున్నారు. ఆ తరహాలో దొరక్కూడదని మాట్లాడుకున్నారు. ఐశ్వర్యను రెండో పెళ్లి చేసుకోవాలని తిరుమల్రావు ప్రణాళిక రచించాడు. హత్య తర్వాత తిరుమల్రావు, ఐశ్వర్య లద్దాఫ్ వెళ్లాలని నిర్ణయించుకున్నారు. ఐశ్వర్య తల్లితో తిరుమల్రావుకు వివాహేతర సంబంధం ఉంది. ఈ కేసులో ఇప్పటి వరకు 8 మంది నిందితులను అరెస్ట్ చేశాం" అని ఎస్పీ తెలిపారు.

చిన్నపిల్లాడిలా నడవడం నేర్చుకుంటున్నా.. అంతరిక్షం నుంచి శుభాంశు లైవ్ కాల్

జూన్ 26, (రిపబ్లిక్ న్యూస్): కోట్లాది మంది భారతీయుల ఆశలను మోస్తూ భారత వైమానిక దళ ఫైటర్ పైలట్ అయిన మన వ్యోమగామి శుభాంశు శుక్లా అంతరిక్షంలోకి దూసుకెళ్లారు. మరికొన్ని గంటల్లో అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రాన్ని చేరుకోనున్నారు. ప్రస్తుతం భూకక్ష్యలో వ్యోమనౌకలో తిరుగుతున్న ఆయన.. అంతరిక్షం నుంచి లైవ్లో మాట్లాడారు. ఈ ప్రయాణం చాలా అద్భుతంగా ఉందని తెలిపారు. భారరహిత స్థితిలో ఎలా నడవాలో చిన్నపిల్లాడిలా నేర్చుకుంటున్నానని అన్నారు.

"అంతరిక్షం నుంచి అందరికీ నమస్కారం. తోటి వ్యోమగాములతో కలిసి ఇక్కడ ఉండటం చాలా ఆనందంగా ఉంది. ఇదో గొప్ప ప్రయాణం. 30 రోజుల క్వారంటైన్ తర్వాత ఐఎస్ఎస్ కు చేరుకోబోతున్నాం. ఈ ప్రయాణంలో నాకు సహకరించిన ప్రతిఒక్కరికీ కృతజ్ఞతలు. మాతో పాటు ఈ రైడ్కు జాయ్ (ఒక బేబీ హంస బొమ్మ) కూడా వచ్చింది. భారత సంప్రదాయంలో హంసను విజ్ఞానంగా సూచిస్తారు" అని శుక్లా ఆనందం వ్యక్తంచేశారు. "భార రహిత స్థితికి ఇప్పుడిప్పుడే అలవాటుపడుతున్నా. అంతరిక్షంలో ఎలా నడవాలి, ఎలా తినాలి అనే విషయాలను చిన్నపిల్లాడిలా నేర్చుకుంటున్నా. ఇక్కడున్న ప్రతీ క్షణాన్ని ఆస్వాదిస్తున్నా. నా భుజంపై మువ్వన్నెల పతాకం ఉంది. అది చూస్తున్నప్పుడు ఈ ప్రయాణంలో నేను ఒంటరి కాను.. కోట్లాది మంది భారతీయులు నాకు తోడుగా ఉన్నారనే భావన కలుగుతుంది. రోదసియానంలో నాది చిన్న అడుగే కావొచ్చు. కానీ, భారత మానవ సహిత అంతరిక్ష యాత్రలకు ఘనమైన ముందడుగు. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో వీలైనంత ఎక్కువ సమయం గడుపుతా. నా అనుభవాలను మీతో పంచుకునేందుకు ఎదురుచూస్తున్నా" అని శుభాంశు అన్నారు. దాదాపు 15 నిమిషాల పాటు ఈ లైవ్కాల్ సాగింది. భారత కాలమానం ప్రకారం బుధవారం మధ్యాహ్నం 12.01 గంటలకు అమెరికాలోని కెన్నడీ అంతరిక్ష కేంద్రం నుంచి యాక్సియం-4 మిషన్లో భాగంగా శుభాంశుతో పాటు మొత్తం నలుగురు వ్యోమగాములు ఐఎస్ఎస్కు బయల్దేరిన సంగతి తెలిసిందే. గురువారం సాయంత్రం 4.30 గంటలకు వీరి వ్యోమనౌక అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంతో అనుసంధానం అవుతుంది. ఈ బృందం 14 రోజులపాటు ఐఎస్ఎస్లో ఉండి పలు పరిశోధనలు చేస్తారు. 41 ఏళ్ల తర్వాత భారతీయుడొకరు అంతరిక్షంలోకి వెళ్లడం ఇదే తొలిసారి.

సీఎం చంద్రబాబు విజనరీ లీడర్:బాబా రామ్ దేవ్

హార్సిలీహిల్స్, జూన్ 26, (రిపబ్లిక్ న్యూస్): అన్నమయ్య జిల్లాలో ప్రముఖ యోగా గురువు బాబా రామ్దేవ్ పర్యటించారు. ప్రముఖ పర్యటక కేంద్రం హార్సిలీహిల్స్ను ఆయన సందర్శించారు. అక్కడ అంతర్జాతీయ వెల్నెస్ సెంటర్ ఏర్పాటుకు స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా బాబా రామ్దేవ్ మాట్లాడుతూ.. ఏపీ సీఎం చంద్రబాబు విజనరీ లీడర్ అని కొనియాడారు. ఆయన సూచనతో హార్సిలీహిల్స్ వెల్నెస్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. సాంస్కృతిక, ఆధ్యాత్మిక, వెల్నెస్ సెంటర్ ఏర్పాటుకు ప్రణాళికలు చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే తమ ప్రతినిధులు హార్సిలీహిల్స్ను పరిశీలించినట్లు చెప్పారు. కార్యక్రమంలో పర్యటక శాఖ అధికారులు పాల్గొన్నారు.

శక్తిమంతమైన నాయకులు, ప్రభుత్వంతోనే అభివృద్ధిలో వేగం:పవన్ కల్యాణ్

రాజమహేంద్రవరం, జూన్ 26, (రిపబ్లిక్ న్యూస్): రాజమహేంద్రవరం అంటే గుర్తుకొచ్చేది గోదావరి తీరమని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. అఖండ గోదావరి ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. తీరం వెంట నాగరికత, భాష అన్నీ అభివృద్ధి చెందుతాయని చెప్పారు. ఆంధ్రుల అన్నపూర్ణగా పేరుగాంచిన డొక్కా సీతమ్మకు జన్మనిచ్చిన నేల ఇది అని చెప్పారు.

"ఆదికవి నన్నయ్యతో పాటు ఎంతో మంది కళాకారులకు జన్మనిచ్చిన నేల ఇది. ఎంతో కాలంగా ఉన్న కలను సాకారం చేసే దిశగా ముందుకెళ్లడం ఆనందదాయకం. పర్యటక రంగంలో యువతకు ఎక్కువ ఉపాధి అవకాశాలు ఉంటాయి. ప్రాజెక్టు పూర్తయితే ఏటా 4 లక్షల మంది పర్యటకులు పెరిగే అవకాశముంది. శక్తిమంతమైన నాయకులు, ప్రభుత్వం ఉంటే అభివృద్ధి వేగవంతమవుతుంది. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ కాకుండా ఆపగలిగామంటే దానికి కేంద్రమంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ కారణం. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి ఆయన ప్రత్యేక కృషి చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పర్యటక కేంద్రాలకు పునరుజ్జీవం అందించాలని కోరుతున్నాం. రాజస్థాన్లో వీరులు పుట్టిన నేల నుంచే గజేంద్ర సింగ్ షెకావత్ వచ్చారు. ఆంధ్రుల పౌరుషం ఉన్న ఈ నేల స్వభావాన్ని అర్థం చేసుకుంటున్నారు" అని పవన్ కల్యాణ్ చెప్పారు.

'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో ఎమ్మెల్యేలకు అవమానం:రఘురామ

అమరావతి, జూన్ 26, (రిపబ్లిక్ న్యూస్): 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో ఎమ్మెల్యేలకు అవమానం జరిగిందని ఏపీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు అన్నారు. కలెక్టర్ కంటే ఎమ్మెల్యే ప్రొటోకాల్ పెద్దదని చెప్పారు. "కలెక్టర్, ఎస్పీ, ఎంపీని ఒక టేబుల్ వద్ద కూర్చోబెట్టారు. మరో టేబుల్ వద్ద కార్పొరేషన్ డైరెక్టర్లతో కలిపి ఎమ్మెల్యేలను కూర్చోబెట్టారు. ప్రభుత్వం నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రొటోకాల్ నిబంధనలు పాటించలేదు. ప్రభుత్వ కార్యక్రమానికి స్పీకర్, డిప్యూటీ స్పీకర్ను కూడా ఆహ్వానించాలి. ఎమ్మెల్యేలకు జరిగిన అవమానంపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్)కి లేఖ రాస్తా. ఇది మొదటి తప్పుగా భావిస్తున్నా. కార్యక్రమానికి వెళ్లి ఉంటే సీటింగ్ విధానం చూసి బయటకు వచ్చేసేవాడిని. అవమానం జరిగిందని చాలా మంది ఎమ్మెల్యేలు నాతో చెప్పినందునే మాట్లాడుతున్నా. ప్రొటోకాల్ ఉల్లంఘన ప్రభుత్వ పెద్దలకు తెలిసే జరిగిందో.. లేదో నాకు తెలియదు" అని రఘురామ వ్యాఖ్యానించారు.

printed and published by B.Nagendra on behaly of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: B.NAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic@gmali.com

చరిత్రలో నేటి ప్రత్యేకత

- 2019: ప్రపంచ శీతలీకరణ దినోత్సవం.
- 1892: అమెరికన్ నవలా రచయిత్రి పెర్ల్ ఎస్.బక్ జననం (మ.1973).
- 1933: భారతీయ సాహితీకారుడు కోవెల సంపత్కుమారాచార్య జననం (మ.2010)
- 1966: ఆంగ్ల పాత్రికేయుడు రాజు నరిశెట్టి జననం.
- 1980: తెలుగు సినిమా నటుడు ఉదయకిరణ్ జననం (మ.2014).
- 2007: ఆంధ్రప్రదేశ్ ఉద్యాన విశ్వవిద్యాలయము ప్రారంభం.
- 1874: భారతదేశంలో రిజర్వేషన్ ల పితామహుడు ఛత్రపతి సాహు మహారాజ్ జననం (మ.1922). (చిత్రంలో)

ప్రపంచ శీతలీకరణ దినోత్సవం

పెర్ల్ ఎస్.బక్


కోవెల సంపత-కుమారాచార్య

రాజు నరిశెట్టి

ఉదయకిరణ్

ఉద్యాన విశ్వవిద్యాలయము ప్రారంభం

ఛత్రపతి సాహు మహారాజ్

'బెట్.. ఇలాంటి 'వార్'ను మీరెప్పుడూ చూసి ఉండరు'..:ఎన్టీఆర్

హృతిక్ రోషన్, ఎన్టీఆర్ కీలక పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'వార్ 2'స. అయాన్ ముఖర్జీ దర్శకత్వం వహిస్తున్నారు. కియారా అద్వాణీ కథానాయిక. ఈ స్పై థ్రిల్లర్ కోసం సినీప్రియులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. మరో 50 రోజుల్లో ఇది విడుదల కానున్న నేపథ్యంలో చిత్రబృందం కౌంట్ డౌన్ మొదలు పెట్టింది. సినిమాలోని ప్రధాన నటీనటుల సరికొత్త పోస్టర్లను సోషల్మీడియాలో పంచుకుంది. ఈ ప్రచార చిత్రాలను అభిమానులతో పంచుకున్న ఎన్టీఆర్.. "బెట్ కాస్తున్నా.. ఇలాంటి వార్ను మీరెప్పుడూ చూసి ఉండరు. కౌంటౌన్ మొదలు పెట్టండి" అని పేర్కొన్నారు. తెలుగు, తమిళం, హిందీ భాషల్లో ప్రపంచవ్యాప్తంగా ఈ సినిమా విడుదల కానుంది. యశ్రాజ్ ఫిల్మ్స్ బ్యానర్పై రూపొందుతోన్న స్పై యూనివర్సో భాగంగా వస్తున్న ఆరో చిత్రమిది. 2019లో విడుదలైన 'వార్కు కొనసాగింపుగా ఇది రూపొందుతోంది. ఆగస్టు 14న ఇది ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ప్రస్తుతం చిత్రీకరణ దశలో ఉంది. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలు ఈ సినిమాపై అంచనాలు పెంచాయి. ఈ చిత్రాన్ని ఉద్దేశించి దర్శకుడు అయాన్ ముఖర్జీ ఇటీవల స్పందించారు. "వార్కు కొనసాగింపుగా వస్తోన్న చిత్రం కావడంతో 'వార్ 2' విషయంలో నాపై ఎంతో బాధ్యత ఉంది. ఇది నాకు దొరికిన గొప్ప అవకాశంగా భావిస్తున్నా. ఇలాంటి భారీ ప్రాజెక్ట్ భాగమైనందుకు ఆనందిస్తున్నా. ప్రేక్షకుల్లో ఉన్న అంచనాలను దృష్టిలో ఉంచుకొని దీనిని భారీ స్థాయిలో తీర్చిదిద్దుతున్నా" అని చెప్పారు.

ఆ బుక్తో దర్శనమిచ్చిన ఎన్టీఆర్:
'వార్ 2'కు సంబంధించిన సాంగ్ చిత్రీకరణలో భాగంగా గురువారం ఎన్టీఆర్ ముంబయి చేరుకున్నారు. ముంబయి ఎయిర్పోర్టో ఆయన్ని ఫొటోగ్రాఫర్లు క్లిక్ మనిపించారు. ఈక్రమంలో ఆయన చేతిలోని 'మురుగ: ది లార్డ్ ఆఫ్ వార్, ది గాడ్ ఆఫ్ విస్డమ్' పుస్తకం అందరి దృష్టినీ ఆకర్షించింది. ఆనంద్ బాలసుబ్రమణియన్ రచించిన ఈ పుస్తకంలో కార్తికేయుడి కథను వివరించారు. దర్శకుడు త్రివిక్రమ్తో చేయనున్న ప్రాజెక్ట్ కోసం ఎన్టీఆర్ సన్నద్ధమవుతున్నారని.. అందుకే దీనిని చదువుతున్నారని పలువురు భావిస్తున్నారు. ఎన్టీఆర్- త్రివిక్రమ్ కాంబినేషన్లో రానున్న సినిమాపై అంచనాలు పెంచుతూ ఇటీవల నిర్మాత నాగవంశీ ఆసక్తికర పోస్టులు పెట్టారు. కార్తికేయుడి పద్యాన్ని ఆయన ఎక్స్ వేదికగా షేర్ చేశారు. పురాణాలతో ముడిపడిన కథలో ఎన్టీఆర్ నటించనున్నారని.. ఆయన తెరపై కార్తికేయుడిగా కనిపించనున్నారని ప్రచారం జరిగింది.

ఆ కామెంట్స్ నేను చేయలేదు:ప్రియాంకా చోప్రా

పురుషులు ఎలాంటి మహిళలను వివాహం చేసుకోవాలనే దానిపై నటి ప్రియాంకా చోప్రా కీలక వ్యాఖ్యలు చేసినట్లు గత కొన్నిరోజుల నుంచి ప్రచారం జరుగుతోంది. సోషల్మీడియాలో వైరల్గా మారిన ఈ వ్యాఖ్యలను ఉద్దేశించి తాజాగా ఆమె స్పష్టతనిచ్చారు. ఆ వ్యాఖ్యలు తాను చేయలేదన్నారు. ఆన్లైన్ యుగంలో ఇలాంటి తప్పుడు స్టేట్మెంట్స్ వైరల్ కావడం సర్వసాధారణం అని తెలిపారు. ఆ బోల్డ్ కామెంట్కు సంబంధించిన స్క్రీన్ షాట్ను ఇన్స్టా వేదికగా షేర్ చేసిన ప్రియాంక.. "ఇలాంటి కామెంట్స్ నేను చేయలేదు. ఈ విధంగా నేను ఎక్కడా మాట్లాడలేదు. ఇది సోషల్మీడియాలో సృష్టించిన వార్త మాత్రమే. ఎలాంటి నిజం లేదు. ఇతరుల దృష్టిని ఆకర్షించి వైరల్ కావడం కోసం ఇలాంటి అసత్య వార్తలను సృష్టించడం ఇప్పుడు సులభమైపోయింది. ఇలాంటి వార్తలను నమ్మే ముందు దయచేసి ఒక్కసారి క్రాస్ చెక్ చేసుకోండి. ఆన్లైన్లో వచ్చే ప్రతి వార్త నమ్మొద్దు" అని కోరారు. కొంతకాలం క్రితం ప్రియాంక పేరుతో ఓ వార్త నెట్టింట వైరల్ అయింది. పురుషులు ఎలాంటి మహిళలను వివాహం చేసుకోవాలనే విషయంపై ఆమె మాట్లాడారనేది అందులోని సారాంశం. 'వర్జినిటీ ఉన్న అమ్మాయిని కాదు మంచి గుణాలు ఉన్న మహిళను వివాహం చేసుకోండి. ఎందుకంటే వర్జినిటీ అనేది ఒక్క రాత్రితో పోతుంది కానీ, సభ్యత, సంస్కారం జీవితాంతం ఉంటాయి' అంటూ నటి వ్యాఖ్యానించినట్లు అందులో పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలు అంతటా చర్చకు దారి తీశాయి.

ప్రజా రిపబ్లిక్ దినపత్రిక
9948814188,
9985876888
ప్రకటన
ప్రజా సమస్యల పై అనునిత్యం ప్రజా గళాన్ని అక్షర సత్యాలతో కూడిన సంచలన వరుస కథనాలను అందిస్తూ దూసుకెళ్తున్న ప్రజా రిపబ్లిక్ దినపత్రికకు రెండు తెలుగు రాష్ట్రాలలో తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ జిల్లాలలో, నియోజకవర్గాలలో స్టాప్ రిపోర్టర్లు, పాత్రికేయులు, మండలాల నందు పాత్రికేయులు కావలెను. ప్రజల పక్షాన నిలుస్తూ సమస్యల పరిష్కారానికి అక్షర పోరాటం చేయడానికి మాతో కలిసి పని చేసేందుకు ఆసక్తి గల అభ్యర్థులు కర్నూలు మరియు నంద్యాలలోని మా కార్యాలయముల నందు లేదా ఫోన్ నెంబర్లకు సంప్రదించగలరు.
ప్రజా రిపబ్లిక్ దినపత్రిక కార్యాలయం, షాప్ నెం: 26, మొదటి అంతస్తు, శ్రీనివాస కాంప్లెక్స్, శ్రీనిధి టిఫిన్ సెంటర్ ఎదురుగా, నంద్యాల - 518501
డోర్ నెం:46/181/జి-1, మనోజ్ టాలెంట్ స్కూల్ దగ్గర, బుధవార పేట, కర్నూలు - 518001
బొజ్జ నాగేంద్ర
ఎడిటర్ & మేనేజింగ్ డైరెక్టర్

రెండో టెస్ట్ మ్యాచ్లో బుమ్రాను ఆడించాలి: రవిశాస్త్రి

ఎడ్జ్బాస్టన్ వేదికగా జులై 2 నుంచి ఇంగ్లాండ్, టీమ్ ఇండియాల మధ్య రెండో టెస్ట్ మ్యాచ్ జరగనుంది. వర్క్ నేపథ్యంలో ఈ సిరీస్లో తాను పూర్తి మ్యాచ్లు ఆడలేనని బుమ్రా ఇంతకుముందే చెప్పాడు. మూడు మ్యాచ్లు మాత్రమే ఆడతానని క్లారిటీ ఇచ్చాడు. ఈనేపథ్యంలో ఒకవేళ రెండో టెస్ట్ మ్యాచ్లో బుమ్రాను ఆడించకుండా.. అతడికి విశ్రాంతి ఇస్తే అది సరైన వ్యూహం కాబోదని టీమ్ ఇండియా మాజీ కోచ్ రవిశాస్త్రి అభిప్రాయపడ్డాడు. ఒకవేళ అలాచేస్తే ఇంగ్లాండ్ తో జరుగుతున్న అయిదు టెస్ట్ మ్యాచ్ల సిరీస్లో ఇప్పటికే మొదటి మ్యాచ్ ఓడిపోయిన టీమ్ ఇండియా 2-0తో వెనకబడుతుందని రవిశాస్త్రి జోస్యం చెప్పాడు.'బుమ్రా మూడు టెస్ట్ మ్యాచ్లు ఆడతానని చెప్పాడు. అవి ఏ మూడో స్పష్టంగా తెలియదు. బహుశా అతడు రెండో మ్యాచ్లో విశ్రాంతి తీసుకుంటాడనుకుంటున్నా. ఎందుకంటే బుమ్రా.. లార్డ్స్ జరగనున్న మూడో టెస్ట్ మ్యాచ్లో కచ్చితంగా ఆడాలనుకుంటాడు. రెండో మ్యాచ్లో అతడు ఆడకుంటే మాత్రం టీమ్ ఇండియా ఈ సిరీస్లో 2-0తో వెనకబడుతుంది. అందుకే అతడు తప్పనిసరిగా రెండో మ్యాచ్లో ఆడాలని నేను కోరుకుంటున్నా' అని రవిశాస్త్రి ఓ స్పోర్ట్స్ ఛానల్ అన్నాడు. అలాగే టీమ్ ఇండియా రెండో టెస్ట్ మ్యాచ్లో బౌన్స్అప్ కావాలని రవిశాస్త్రి సూచించాడు. 'టీమ్ ఇండియా ఇంతకుముందు న్యూజిలాండ్తో 3-0 తేడాతో ఓటమిని చవిచూసింది. ఆస్ట్రేలియాతోనూ సిరీస్ ను కోల్పోయింది. ఈ నేపథ్యంలో టీమ్ ఇండియా కచ్చితంగా రెండో మ్యాచ్లో తిరిగి గాడిన పడాలి. ఇంగ్లాండ్ జట్టు బౌలింగ్ దళాన్ని గాయాల బెడద వేధిస్తోంది. ఈ అవకాశాన్ని టీమ్ ఇండియా సద్వినియోగం చేసుకోవాలి. ఇది భారత జట్టుకు తిరిగి పుంజుకునే సమయం' అని రవిశాస్త్రి అన్నాడు.

బాడీ కొలెస్ట్రాల్ తగ్గి గుండె ఆరోగ్యాన్ని మెరుగ్గా మార్చే ఎండుద్రాక్ష పాలు, ఎలా తయారుచేసి వాడాలంటే

ఆరోగ్యం

ఎండుద్రాక్ష, పాలు రెండు కూడా ఆరోగ్యానికి చాలా మంచివి. వీటిని కలిపి తీసుకుంటే మరింత మంచిది. వీటిని తీసుకోవడం వల్ల కలిగే లాభాలేంటో తెలుసుకోండి.

ఎండుద్రాక్షప్రయోజనాలు అందరికీ తెలిసినవే. ఇది శరీర పనితీరుకి చాలా మంచివి. ఇందులో బాడీకి హెల్ప్ చేసే ఎన్నో ముఖ్య విటమిన్స్, ఖనిజాలు ఎక్కువ మొత్తంలో ఉంటాయి. వీటిని రాత్రుళ్లు పాలలో నానబెట్టి తాగాలి. ఆయుర్వేదం ప్రకారం, రాత్రిపూట ఓ గ్లాసు వేడిపాలు తాగితే మంచి నిద్ర వస్తుంది. ఓ గ్లాసు వేడి పాలలో కొన్ని ఎండుద్రాక్షలు వేసి నానిన తర్వాత తాగాలి. పాలలో వివిధ రకాల పోషకాలు ఈ ఎండుద్రాక్షలోని విటమిన్స్తో కలిపి మీకు డబుల్ బెనిఫిట్స్ని అందిస్తాయి.

డీటాక్స్



పాలలో ఎండుద్రాక్షని కలిపి తీసుకుంటే బాడీ డీటాక్స్ అవుతుంది. దీనిలోని ఫైబర్ కంటెంట్ శరీరం నుండి విషాన్ని బయటికి పంపిస్తాయి. ఇందులోని యాంటీ ఆక్సిడెంట్స్ కణజాలాలకు నష్టం జరగకుండా నివారిస్తాయి. ఇది మొత్తం ఆరోగ్యాన్ని కాపాడతాయి.ఎండుద్రాక్షలో సహజ చక్కెర్లు ఉంటాయి. ఇవి శరీరానికి శక్తిని అందిస్తాయి. పాలలోని ప్రోటీన్ కంటెంట్ ఎక్కువ సేపు శక్తిగా ఉండడంలో హెల్ప్ చేస్తాయి.

ఎముకల బలానికి

పాలలో కాల్షియం, విటమిన్ డిలు ఉంటాయి. ఇవి ఎముకల ఆరోగ్యానికి చాలా మంచివి. అదే విధంగా, ఎముకల సాంద్రతని కాపాడడంలో కాపాడతాయి. ఎండుద్రాక్షని రెగ్యులర్గా తీసుకుంటే ఎముకలు బలంగా మారి ఆస్టియోపోరిసిస్ ప్రమాదం తగ్గుతుంది. ఎముకలు బలంగా మారతాయి.

కొలెస్ట్రాల్ని తగ్గించి గుండె ఆరోగ్యానికి



ఎండుద్రాక్షని వేడిపాలలో కలిపి తీసుకుంటే గుండె ఆరోగ్యానికి మంచిది. ద్రాక్షలో పొటాషియం కంటెంట్ రక్తపోటుని కంట్రోల్ చేయడంలో హెల్ప్ చేస్తుంది. ఇందులోని యాంటీ ఆక్సిడెంట్స్ కొలెస్ట్రాల్ని తగ్గించడంలో సాయపడతాయి. ఇది గుండెజబ్బుల ప్రమాదాన్ని తగ్గించి గుండె ఆరోగ్యాన్ని కాపాడతాయి.

నిద్రలేమికి



నిద్రసమస్యలతో బాధపడేవారు పాలలో ఎండుద్రాక్ష వేసి తాగాలిని దీనిలోని సహజ పదార్థాలు ప్రశాంతంగా మార్చి పట్టేలా చేస్తాయి. ద్రాక్షలో మెలటోనిన్ ఉంటుంది. ఇది నిద్రను నియంత్రిస్తుంది. వేడి పాలలో ఉపశమన గుణాలు ఉంటాయి. రాత్రిపడుకునే ముందు ఈ పాలని తాగితే మంచి నిద్ర వస్తుంది.

జీర్ణక్రియ

ఎండుద్రాక్షలోని గుణాలు జీర్ణక్రియకి హెల్ప్ చేస్తాయి. వీటిని పాలలో నానబెట్టి తింటే చాలా మంచిది. ద్రాక్షలోని ఫైబర్ కంటెంట్ ప్రేగు కదలికల్ని మెరుగ్గా చేస్తుంది. ప్రోయోటిక్స్ కలిగిన పాలు కడుపు ఆరోగ్యాన్ని కాపాడతాయి. రెండింటిని కలిపి తీసుకుంటే మలబద్ధకం నుండి ఉపశమనం లభిస్తుంది. మొత్తం జీర్ణక్రియ మెరుగ్గా మారుతుంది.

ఎండుద్రాక్షలోని గుణాలు

ఎండుద్రాక్షలో పోషకాలు పుష్కలంగా ఉంటాయి. ఇందులోని యాంటీ ఆక్సిడెంట్స్, విటమిన్స్, ఐరన్, పొటాషియం, మెగ్నీషియంలు ఎక్కువగా ఉంటాయి. పాలలో నానబెట్టినప్పుడు కాల్షియం, ప్రోటీన్, విటమిన్ డిలను కూడా అందిస్తాయి. దీనివల్ల శరీరానికి పోషకాలు అందుతాయి. రాత్రుళ్లు పడుకునే ముందు ఈ పాలను తాగితే చాలా మంచిది.

ఇమ్యూనిటీ

పాలలో ఎండుద్రాక్షని కలిపి తాగితే ఇమ్యూనిటీ పెరుగుతుంది. ద్రాక్షలోని యాంటీ ఆక్సిడెంట్ కంటెంట్ బాడీలోని ఫ్రీ రాడికల్స్తో పోరాడతాయి. ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గిస్తాయి. ఇమ్యూనిటీని పెంచుతాయి. ఇమ్యూనిటీ బలంగా ఉంటే ఇన్ఫెక్షన్స్, వ్యాధులు దూరమవుతాయి.

చర్మ ఆరోగ్యానికి

ఎండుద్రాక్షలు నానబెట్టిన పాలు తాగడం వల్ల చర్మ ఆరోగ్యం మెరగవుతుంది. ద్రాక్షలోని విటమిన్స్, ఖనిజాలు, ముఖ్యంగా విటమిన్ సి, యాంటీఆక్సిడెంట్స్ చర్మాన్ని కాంతివంతంగా తయారుచేస్తాయి. మీరు దీన్ని రోజూ తీసుకుంటే మొటిమలు, మచ్చలు తొలగిపోతాయి. ఇది వృద్ధాప్య సంకేతాలను నివారించడంలో సాయపడుతుంది. పాలు అందించే హైడ్రేషన్ చర్మాన్ని మరింత కాంతివంతంగా, ప్రకాశవంతంగా మారుస్తుంది.

ఎలా తయారుచేయాలి

వేడిపాలలో ద్రాక్షని క్లీన్ చేసి వేసి కాసేపు అలానే ఉంచండి. ద్రాక్షలోని గుణాలు పాలలో కలుస్తాయి. ఈ పాలు తాగితే శరీరానికి ఎన్నో లాభాలుంటాయి. రెగ్యులర్గా తాగే నార్మల్ పాల బదులు ఈ పాలని తాగండి. దీంతో చాలా సమస్యలు దూరమవుతాయి.